క్లుప్తంగా

వీసీని కలిసిన ప్రైవేటు కళాశాలల యాజమాన్యం



వీసీకి పూలబోకే అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ సభ్యులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేషన్ సభ్యులు ఆయనను కలిసి పూలబోకే అందజేసి అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రావు, లింగయ్య, రాంమోహన్, జానయ్య, సత్యం, నరసింహారెడ్డి, ఆదిత్య, శంకర్ తదితరులు ఉన్నారు.

హఫీజ్‌కు అక్కినేని సినీ అవార్డు



అవార్డు అందుకుంటున్న హఫీజ్

కనగల్ : మండల కేంద్రానికి చెందిన గాయకుడు డాక్టర్ ఎండీ హఫీజుద్దీన్ అక్కినేని సినీఅవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అక్కినేని శత జయంతి ఉత్సవాలలో ఆయనకు అవార్డు, ప్రశంసాపత్రాన్ని సినీ దర్శకుడు, నిర్మాత డా.శ్రీకాంత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యరగాని నాగన్నగౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఇందిర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఇందిరా, డాక్టర్ విల్సన్, గాన కళారత్న త్రినాథ్ రావు, డాక్టర్ లీపికరెడ్డి పాల్గొన్నారు.

భూపాల్‌కు జాతీయ పురస్కారం



భూపాల్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఎన్జీ కళాశాలలో తెలుగు అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ వాసా భూపాల్‌కు అఖిల భారతీయ భాషా సాహిత్య పురస్కారం లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ శనివారం తెలిపారు. భూపాల్ భాషా సాహిత్య రంగాలలో చేసిన సేవలకుగాను ఈ పురస్కారం లభించిందన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు పట్టణంలో జరిగే కార్యక్రమంలో భూపాల్ అవార్డును అందుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భూపాల్‌ను కళాశాలలో సహ అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిల్లి సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, పరీక్షల విభాగం అధికారి బి.నాగారాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్ పాల్గొన్నారు.

చెరుపల్లి లక్ష్మమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చిట్యాల : మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ, అక్క గంజి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. శనివారం పట్టణంలో లక్ష్మమ్మ, రంగమ్మ చిత్రపటాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నివాళులర్పించారు. వారి వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మెండే సైదులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, నాయకులు జిట్ట బొందయ్య, కోనేటి ఎల్లయ్య, ఆగు అశోక్, సీపీఎం నాయకులు జిట్ట నగేష్, శ్రీనువాసులు తదితరులు ఉన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రథమ వార్షికోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న చాడ కిషన్‌రెడ్డి కుటింబీకులు

శాలిగౌరారం : మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపకులు చాడ కిషన్‌రెడ్డి దంపతులు ఆలయంలో ఆదిత్యాహోమం,పంచసూక్తహోమాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో విగ్రహదాత చాడ కిషన్‌రెడ్డి కుటింబీకులతో పాటు ఆలయ ధర్మకర్తలు శేషభట్టర్ రత్నమాచార్యులు, రామచంద్రాచార్యులు, జగన్మోహనాచార్యులు ఉన్నారు.

గేటెడ్ నీలగిరి

నల్లగొండ పట్టణంలో విస్తరిస్తున్న నగర సంస్కృతి

- ప్రజల అభిరుచికి తగ్గట్టుగా నిర్మాణాలు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవనం
- చిన్న పట్టణాల్లో విస్తరిస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు



బృందావన్ కాలనీ



శబరి హోమ్స్

గేటెడ్ కమ్యూనిటీ కల్చర్ నీలగిరి పట్టణానికి వచ్చింది. పట్టణ శివారుల్లో ఏర్పాటవుతున్న గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసం ఉండేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రజల అభిరుచికి తగ్గట్టుగా కాలనీలు ఏర్పాటవుతున్నాయి. విశాలమైన రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, నిరంతరం విద్యుత్, నీటి వసతి ఇలా సకల సౌకర్యాలతో ఏర్పాటవుతున్న కాలనీల్లో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు నివాసం ఉంటున్నారు.

లైఫ్‌స్టైల్

నల్లగొండ టూటౌన్ : పట్టణమంటే ఒకరికొకరికి పలకరింపు ఉండదు.. ఎదురుపడ్డా మాటలుండవు.. ఇంట్లో శుభకార్యం అయినా ఇక్కడి వారికి పిలుపు ఉండదు.. ఒకరింట్లో ఆపద వచ్చినా చూసి వచ్చే వారే ఉండరు.. ఇవన్నీ ఒకప్పటి మాటలు.. కానీ ఇప్పుడు పల్లె వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటవుతున్నాయి గేటెడ్ కమ్యూనిటీలు. వీటిలో నివాసులు అంతా ఒకే కుటుంబంలా కలిసి మెలసి ఉంటున్నారు. ఆయా కాలనీల్లో ఆహ్లాదకమైన వాతావరణంలో.. సాయంకాలం వేళ మహిళలు, పెద్దలు ఇంటి ముందట కూర్చొని ముచ్చట్లలో మునిగిపోతున్నారు. మంచి చెడును పంచుకుంటూ.. ఆపద సమయంలో మేమున్నామంటూ భరోసా ఇస్తూ కలసిమెలసి జీవనం సాగిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం..

గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసం అంటే ఫక్తు పల్లె మాదిరిగానే ఉంటుందనే అభిప్రాయం బలంగా ఉంది. ముఖ్యంగా సెక్యూరిటీ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవనేది ప్రజల భావన. అందుకే గేటెడ్ కాలనీల్లో ఉండేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ప్రజల అభిరుచికి తగ్గట్టుగానే.. బిల్డర్లు కూడా భవన నిర్మాణాలను చేపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. బిల్డరే బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డులో పదుల సంఖ్యలో గేటెడ్ కమ్యూనిటీలు వెలిశాయి. వీటిలో ఎక్కువగా ప్రభుత, ప్రైవేట్ ఉద్యోగులు నివాసం ఉంటున్నారు.



బృందావన్‌కాలనీలో కమ్యూనిటీ హాల్, విశాలమైన రోడ్లు

కలిసే పండుగలు చేసుకుంటాం



గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో భద్రత పటిష్టంగా ఉంటుంది. ఎంత మంది ఉన్నా అందరం కలిసి మెలిసి పండుగలు ఘనంగా జరుపకుంటాం. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా కాలనీని పరిశుభ్రంగా ఉంచుకుంటాం. ఇతరులెవరు కాలనీలోపలికి రారు.

- పానుగోతు చందు, శబరి హోమ్స్

ముందుగానే అభివృద్ధి చేస్తున్నాం



రోడ్లు, తాగు నీరు, డ్రెయినేజీ, చెట్లు, లైటింగ్ వంటి సదుపాయాలను ముందస్తుగానే అభివృద్ధి చేయడం ద్వారా గేటెడ్ కాలనీల్లో ఉండేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. కమ్యూనిటీ హాల్స్, రోడ్లు, పార్కులు, ఇంటింటికి నల్లా కనెక్షన్ వంటివి ముందే అభివృద్ధి చేసి ఇస్తున్నాం. గేటెడ్ కాలనీల్లో దుమ్ము, దూళి, కాలుష్యం కూడా తక్కువగా ఉంటుంది.

- దోసపాటి శ్రీనివాస్, బిల్డర్, నల్లగొండ

ఎలాంటి సమస్యలూ ఉండవు



గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో కులాలకు అతీతంగా అన్ని పండుగలను సమష్టిగా చేసుకుంటాం. కాలనీల్లోకి ఇతరులు వస్తే వారి వివరాలు ఆరా తీసిన తరువాతే లోపలికి పంపుతారు. భద్రత, రోడ్లు, డ్రెయినేజీ, తాగు నీరు, లైటింగ్ లాంటి సమస్యలు ఉండవు.

- నాగేశ్వర్‌రావు, మానసవిహార్

పల్లెలో మాదిరిగానే ఉంటున్నాం



పేరుకు పట్టణంలో ఉంటున్నా పల్లెటూరు మాదిరిగానే అందరం కలిసి ఉంటున్నాం. సాయంత్రం, సెలవు రోజుల్లో మహిళలంతా కలిసి అన్ని విషయాలు చర్చించుకుంటాం. గోరింటాకు, వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి, దుర్గామాత లాంటి పండుగలు ఘనంగా జరుపుకుంటాం.

- భూక్యా పద్మ, హ్యాపీ హోమ్స్

పరిశుభ్రంగా ఉంచుతాం



బృందావన్ కాలనీలో అందరం కలిసి ప్రశాంతంగా ఉంటున్నాం. విశాలమైన రోడ్లు, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం కారణంగా ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపుతున్నాం. కాలనీ తమదని భావించి పరిశుభ్రంగా ఉంచుతున్నాం.

- రాపోలు వెంకటేశ్వర్లు, బృందావన్ కాలనీ

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



కేతేపల్లి : ఇనుపాములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, చెర్కుపల్లి, తుంగతుర్తి, కొప్పోలు, భీమారం, కాసనగోడు, బొప్పారం తదితర గ్రామాలలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం విక్రయించే విషయంలో దళారులను నమ్మవద్దని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈఓ వి.నర్సయ్య, ఏపీఎం బి.యాదమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ గుత్త మంజుల మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జున రావు, నాయకులు బొజ్జ సుందర్, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, బీరం జాన్‌రెడ్డి, బడుగుల నరేందర్‌యాదవ్, కోట పుల్లయ్య, బత్తుల దయాకర్‌రెడ్డి, కె.మహేందర్‌రెడ్డి, ఎడ్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు

నకిరేకల్ : నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.15కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు నిధుల విడుదల జీఓ ప్రతిని ఎమ్మెల్యే వేముల వీరేశం స్థానికంగా వెల్లడించారు. నకిరేకల్ మండలంలో 65నంబర్ జాతీయ రహదారి నుంచి బైరెడ్డిగూడెం వరకు రూ.15లక్షలు, నెల్లిబండ మీదుగా అడవిబొల్లారం నుంచి చెర్వుఅన్నారం రోడ్డు వరకు రూ.3.25 కోట్లు, మండలాపురం నుంచి కొండకిందిగూడెం వరకు రూ.1.95కోట్లు, ఆర్లగడ్డగూడెం నుంచి రామచంద్రాపురం వరకు రూ.1.30 కోట్లు, కేతేపల్లి మండలంలో భీమారం నుంచి వయా పాములపాడు, జిల్లలవారిగూడెం వరకు రూ.1.50కోట్లు, బండపాలెం నుంచి కొత్తోరిగూడెం వరకు రూ.81లక్షలు, జాతీయ రహదారి నుంచి వయా తెలగగూడెం మీదుగా పాములపాడు వరకు రూ.2.50కోట్లు, చిట్యాల మండలంలో జాతీయ రహదారి నుంచి సూరకంటిగూడెం వరకు రూ.84లక్షలు, నార్కట్‌పల్లి మండలంలో అమ్మనబోలు నుంచి వయా బెండలపాడు, బైరవునిబండ వరకు రూ.70లక్షలు, రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం నుంచి కొత్తగూడెం వరకు రూ.1కోటి చొప్పున, మొత్తం 10పనులకుగాను రూ.15కోట్ల మంజూరైన ట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ హయాంలో ఆలయాలపై దాడులు




ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హిందూ దేవతలు, ఆలయాలపై దాడులు పెరిగాయని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ఎలిజాల నర్సింహ ఆరోపించారు. ఈ దాడులను ఖండిస్తూ శనివారం పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో హిందూ దేవతపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం మానేసి పిచ్చివాడని తప్పించారు. లవ్ జిహాద్ పేరుతో హిందూ అమ్మాయిలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు ప్రకాష్, బీజేపీ నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవి, కాశమ్మ, నీరజ, హిందూ సంఘాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నామినీకి ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని తీర్పు

రామగిరి(నల్లగొండ): నామినీకి ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వక్కంటి తిరుపతయ్య హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 2020 ఫిబ్రవరిలో రూ.31,48,399తో మూడేళ్ల పాలసీ తీసుకున్నాడు. పాలసీలో కొడుకు రాజాచంద్ర పేరును నామినీగా చేర్చాడు. తిరుపతయ్య అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2021 మే 7న మృతిచెందాడు. దీంతో నామినీ రాజాచంద్ర ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా తిరుపతయ్య డయాబెటీస్, కాలేయ సంబంధిత వ్యాధితో చనిపోయాడని అందుకు పాలసీ డబ్బులు చెల్లించలేమని చెప్పారు. దీంతో రాజాచంద్ర 2022 మే 5న నల్లగొండలోని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇన్సూరెన్స్ కంపెనీ సరైన పత్రాలు సమర్పించకపోవడంతో కేసు విచారణ చేసిన కమిషన్ అధ్యక్షుడు మామిడి క్రిస్టోఫర్, సభ్యులు ఎస్. సంధ్యారాణి, కె. వెంకటేశ్వర్లు నామినీకి డబ్బులు చెల్లించాలని తీర్పు వెలువరించారు. బాధితుడికి రూ.31,48,399ను 2021 అక్టోబర్ 25 నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అంతేకాకుండా మానసికంగా వేదనకు గురిచేసినందుకు కంపెనీ రూ.లక్ష పరిహారాన్ని ఇవ్వాలని, కోర్టు ఖర్చులకు రూ.10వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది.

ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు

నాంపల్లి : ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా పవిత్రమైనదని ఎంపీడీఓ స్వర్ణకుమారి, ఎస్టీఓ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం, బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓకు సన్మాన కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అనంతరం మండలంలో పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను పంపిణీ చేశారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ గురువారావును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ మల్లిఖార్జునరావు, ముష్టిపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రావు, నాంపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం అజయ్‌కుమార్, అంబేద్కర్ యువ కేంద్రం జాతీయ అధ్యక్షుడు గాలేంక గురుపాదం, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రావు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సిలువేరు నారాయణ, ఈఈయూ అధ్యక్షుడు బారుదోజు దామోదరాచారి, శ్రీధర్‌రెడ్డి శ్రీను ఉన్నారు.

నకిలీ కందిపప్పు అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు

శాలిగౌరారం : నకిలీ కందిపప్పు అమ్మి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ సంఘటన మండలంలోని వల్లాల గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో గ్రామానికి చెందిన గుండ్లపల్లి జ్యోతి, బొంత చిన్నక్క, గుండ్లపల్లి మైసమ్మ, గద్దపాటి అంజమ్మ వంట నిర్వాహకులుగా పనిచేస్తున్నారు. గ్రామంలో తిరుగుతూ పప్పులు అమ్మే డేగ నాగరాజు(గ్రామం తెలియరాలేదు) రూ.100లకు కిలో చొప్పున కందిపప్పును సరఫరా చేస్తానని ఈనెల 1న తనవద్ద ఉన్న ఒరిజినల్ కందిపప్పును శాంపిల్‌గా వారి వద్దకు వెళ్లి చూపించాడు. దీంతో అతడి మాటలు నమ్మిన వంట నిర్వాహకులు 150కిలోల కందిపప్పును కొనుగోలు చేసేందుకు రూ.15వేలు చెల్లించారు. దీంతో అతడు ఒరిజనల్ కందిపప్పుకు బదులు నకిలీ కందిపప్పును సరఫరా చేశాడు. మోడల్‌స్కూల్‌కు దసరా సెలవులు కావడంతో నాగరాజు వద్ద కొనుగోలు చేసిన కందిపప్పును వినియోగించని నిర్వాహకులు స్కూల్ తిరిగి ప్రారంభం కావడంతో శనివారం విద్యార్థులకు వంట చేసేందుకు పప్పు బస్తాను తెరిచిచూశారు. బస్తాలో ఉన్న పప్పు కందిపప్పు కాకపోవడంతో మోసపోయామని గ్రహించారు. ఈ నేపథ్యంలో శనివారం గుండ్లపల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డేగ నాగరాజుపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : చండూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిని అసభ్య పదజాలంతో వేధిస్తున్న హెచ్ఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న హెచ్ఎంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. వంట డబ్బులు మహిళా సంఘం ఖాతాలో జమచేయకుండా తన సొంత ఖాతాల్లో వేసుకుని వారికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నవదీప్, శేఖర్, కిరణ్, జగదీష్, యాదయ్య, కొండన్న, తరుణ్ పాల్గొన్నారు.

టిప్పర్ బ్యాటరీ చోరీ

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన రంగినేని హరిచంద్రనాథ్ టిప్పర్ వాహన బ్యాటరీలను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. శనివారం బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాటరీల విలువ రూ.20వేలు ఉంటుందని వాపోయాడు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ పక్షపాత ధోరణిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కొత్త నిబంధనలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పి నేటికి చేయలేదన్నారు. రుణమాఫీకి ప్రభుత్వం రూ.30వేలు కోట్లు ఇచ్చారని అన్నారు. జూన్‌లో రైతుబంధు ఇవ్వకపోగా వానాకాలంలో ఇచ్చే పరిస్థితి లేదన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతూ మూసీ సుందరీకరణకు రూ.150కోట్లు కేటాయించి రైతులకు రుణమాఫీ చేయడంలేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పోగుల నర్సింహ, వడ్డె సైదిరెడ్డి, దాసరి సంజయ్, పెద్ది బాలనర్సింహ, గుర్రం సైదులు, బెల్లి సుధాకర్, బుచ్చమ్మ, నర్సింహ, రమేష్, అంతటి శ్రీను, వెంకన్న, జానీపాష, యాదయ్య, నాగేష్, తదితరులు ఉన్నారు.

గ్యార్మీ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నవీన్‌కుమార్‌గౌడ్, ముస్లిం మత పెద్దలు

నల్లగొండ : పట్టణంలో జరుగుతున్న లతీఫ్ ఉల్లాషాఖాద్రి ఉర్సు సందర్భంగా శనివారం ఉస్మాన్‌పురలో గ్యార్మీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మారగోని నవీన్ కుమార్‌గౌడ్, షేక్ మిరాజ్‌మహ్మద్, సోయల్, సయ్యద్, జుబేర్ మహ్మద్, ఫాహీమ్, సాదత్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చండూరు(గట్టుప్పల్) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కసిరెడ్డి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గట్టుప్పల్ మండల మహాసభను మండలంలోని నామపురం ప్రాథమిక పాఠశాలలో సంఘం మండల అధ్యక్షుడు బి.పురుషోత్తంరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా దాచేపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసచార్యులు, మహిళా ఉపాధ్యక్షురాలుగా పి.అమృతాదేవి, కోశాధికారిగా లింగయ్య, మండల కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా బి.పురుషోత్తం రాజు, కార్యదర్శులుగా లక్ష్మి, జి.సునీత, బి.సుజాత, కె.కవిత, కే.మంజులత, కోమల్‌కుమార్ ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

24న మాజీ సైనికుల సమావేశం

నల్లగొండ రూరల్ : పట్టణంలోని పానగల్ రోడ్డులో గల మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో ఈనెల 24న మాజీ సైనికుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి చెన్నైకి చెందిన వెల్లింగ్టస్ సెంటర్ ప్రతినిధులు హాజరవుతున్నట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బుల్లెట్ వాహనాల సైలెన్సర్లు మారిస్తే వాహనాలు సీజ్

నల్లగొండ క్రైం : బుల్లెట్ వాహనాల సైలెన్సర్లు మార్చి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ రాజు అన్నారు. శనివారం పట్టణంలో అధిక శబ్దం వచ్చే బుల్లెట్ వాహనాలను పట్టుకుని సైలెన్సర్లను తొలగించి వాహనం వెంట వచ్చిన సైలెన్సర్లను అమర్చిన తర్వాత వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు.

గ్రూప్–1ను వాయిదా వేయాలి

నాంపల్లి : జీఓ 29ను రద్దుచేసి గ్రూప్–1ను వాయిదా వేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 29తో ఇచ్చిన (ఎస్సీ, ఎస్టీ, బీసీ) రిజర్వేషన్‌తోనే ఉద్యోగం పొందాలి తప్ప మార్కులు వచ్చినా ఓపెన్‌లో అవకాశం ఉండదన్నారు. కష్టపడిన వారికి ఫలితం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జీఓలను అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీల నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నాంపల్లి : మండలంలోని చిట్టంపహాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారంతో నవనిర్మాణ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి శ్రీహరి, పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రజిని, సభ్యులు సందీప్ ఉన్నారు.

విద్యార్థులకు షూ అందజేత

తిప్పర్తి : మండలంలోని మామిడాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గోదా కృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పూస లింగయ్య, డీసీ వెంకటరెడ్డి, డీసీ రవిచంద్రన్, వేదవ్యాస్, హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం : నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 17, 18తేదీల్లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, డివిజన్ స్థాయి కబడ్డీ విభాగంలో మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.త్రివేణి కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్–17లో జిల్లా జట్టుకు ఎంపిక కాగా, అండర్–14లో ఏడోతరగతి విద్యార్థిని యు.స్వాతి, 8వ తరగతి చదువుతున్న ఆర్.యశ్వంత్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా అండర్–14 కబడ్డీలో డివిజన్‌స్థాయిలో శాలిగౌరారం మండలం రన్నర్‌ప్‌గా నిలిచి రెండో బహుమతిని సాధించినట్లు మోడల్‌స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) బొడ్డు మల్లేష్ శనివారం స్థానికంగా విలేకరులకు తెలిపారు. విద్యార్థులు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పీడీని అభినందించారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

నకిరేకల్ : ఎమ్మెల్యే వేముల వీరేశంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలలో వారు మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే వీరేశంపై చేసిన తప్పుడు ఆరోపణలపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గుత్తా మాధవరెడ్డి, నర్సింహాయాదవ్, శేఖర్, బొజ్జ సుందర్, మహిందర్‌రెడ్డి ఉన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలని వినతి

నల్లగొండ టౌన్ : మిషన్ భగీరథ కాంట్రాక్టు వర్కర్ల వేతనాలు పెంచాలని కోరుతూ శనివారం కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికంగా మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.